నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు కొండాపూర్ ఏఈ ఎస్.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రభుపాద లేఅవుట్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ ఉండదన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చందానగర్‌లో..

చందానగర్: 11 కేవీ మార్తాండనగర్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు చందానగర్ విద్యుత్ అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు మార్తాండనగర్, న్యూ హఫీజ్‌పేట్, హనీఫ్ కాలనీలలో విద్యుత్ సరఫరాను నిలిపి వేయ నున్నట్లు వారు వివరించారు.

- 11 కేవీ ఆదిత్య ఇంపీరియల్ హైట్స్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆదిత్య ఇంపీరియల్ హైట్స్, వినాయకనగర్, ప్రకాశ్‌నగర్ ప్రాంతాలలో..
- హఫీజ్‌పేట్ ఫీడర్ పరిధిలో.. ఉదయం11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓల్డ్ హఫీజ్‌పేట్, సాయినగర్, యూత్‌కాలనీ, వార్డు కార్యాలయం, గ్రీన్ బావర్చీ ప్రాంతంలో, ఆదిత్య నగర్, ఎస్‌సీబీ కాలనీ, ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్ ప్రాంతంలో విద్యుత్ ఉండదని అధికారులు వివరించారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో... టమాట 20, పచ్చిమిర్చి 45, బెండ 50, కాకర 50, దొండ 40, దోస 40, ఆలు 30, చామ 50, కీర 30, బీర 60, వంకాయ 30, గోకర 50, బీన్స్ 50, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 30, చిక్కుడు 35, ఉల్లి 40(కేజీ), ములక్కాయలు (3) 20 , క్యాలీ ఫ్లవర్ (1) 30, సొరకాయ (కేజీ) 20, అల్లం 70, వెల్లుల్లి 300.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి భెల్ ఎంఐజీ కాలనీ రామాలయంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలు బుధవారం ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా హోమాలు, మన్యుసూక్త హోమం, పూర్ణాహుతి చేపట్టారు. అదే విధంగా చక్రస్నానం నిర్వహించారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

డీఎస్‌యూ నూతన కార్యవర్గం



నూతన అధ్యక్షుడు రమేష్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలోని దళిత విద్యార్థి సంఘం (డీఎస్‌యూ) నూతన అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. డీఎస్‌యూ హెచ్‌సీయూ నూతన అధ్యక్షుడిగా తుంగ రమేష్, కార్యదర్శులుగా బైకి శేఖర్, విరుస్ కొత్తూరిని ఎన్నుకున్నట్లు వారు ప్రకటించారు.డీఎస్‌యూ సీనియర్ నాయకుడు కన్వీనర్‌గా వేణురాథనోళ్ళ అధ్యక్షత వహించగా సమావేశంలో కుమార్‌రాజా, ఉమేష్ అంబేద్కర్, వర్దన్‌తేజ, మనోజ్, రాజేందర్, నాగరాజు, కవిత, శిల్ప, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో బైక్‌ర్యాలీ



రాయదుర్గం: శివాజీ మహరాజ్ జయంతిని పురస్కరించుకొని హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బిఆర్ అంబేడ్కర్ చౌక్ నుంచి కార్గిల్ చౌక్ వరకు నార్త్ షాపింగ్ కాంప్లెక్స్ నుంచి సౌత్ షాపింగ్ కాంప్లెక్స్ వరకు ర్యాలీ సాగింది.

రాజకీయ పార్టీల తీరు మారాలి

రాయదుర్గం: గచ్చిబౌలి హెచ్‌సీయూ క్యాంపస్‌లో స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ సిల్వర్ జూబ్లీ, హెచ్‌సీయూ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ఆధ్వర్యంలో ' ఫ్రీడమ్, ప్రాస్పర్టీస్ అండ్ ఇన్‌క్లూజన్' అనే అంశంపై ప్రత్యేక ఉపన్యాస కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డాక్టర్ జయప్రకాశ్‌నారాయణ్ హాజరై మాట్లాడారు. రాజకీయ పార్టీల వ్యవహార శైలి మారాలని, ప్రజలకు పని కొచ్చే పనులే చేయాలని ఆయన సూచించారు. ఎన్నికలలో సమగ్రమైన హామీలే ఇవ్వాలన్నారు.

కరెంట్ కోతలు లేకుండా..

నిరంతర సరఫరాకు సమ్మర్ యాక్షన్ ప్లాన్

- వేసవిలో పెరిగే లోడ్‌కు అనుగుణంగా పనులు
- రూ.21.94 కోట్ల వ్యయం.. 70 శాతం పనులు పూర్తి
- కొండాపూర్ డీఈ శ్యామ్‌కుమార్




కేబుల్ మార్చుతున్న టీజీపీడీసీఎల్ సిబ్బంది

గచ్చిబౌలి: వేసవిలో కరెంట్ పోకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేసేలా అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్ చేపట్టారు. ట్రాన్స్‌ఫార్మర్స్, కేబుల్స్ కాలిపోవడం, లో ఓల్టేజీ, హై ఓల్టేజీ విద్యుత్ సరఫరాతో ఇళ్లలో విద్యుత్ ఉపకరణాలు కాలిపోతుంటాయి. వేసవిలో ఓవర్‌లోడ్ కారణంగా ఎదురయ్యే సమస్యలపై అధ్యయనం చేసిన అధికారులు సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోని కొండాపూర్ డివిజన్‌లో రూ.21.94 కోట్ల బడ్జెట్‌తో సమ్మర్ యాక్షన్ ప్లాన్ కింద ఆరు రకాల పనులను నెల రోజుల కిందటే ప్రారంభించారు. దాదాపు 70 శాతం పనులు పూర్తయ్యాయని మరో 15 రోజుల్లో మొత్తం పూర్తయ్యే అవకాశం ఉందని కొండాపూర్ డీఈ శ్యామ్‌కుమార్ తెలిపారు.

2 లక్షల సర్వీస్‌లు

టీజీఎస్‌పీడీసీఎల్ కొండాపూర్ డివిజన్ పరిధిలో కొండాపూర్, వైట్‌ఫీల్డ్, కేపీహెచ్‌బీ, అల్లాపూర్, బాలాజీనగర్ సెక్షన్‌లు ఉన్నాయి. కొండాపూర్ సబ్ డివిజన్ పరిధిలో 1.20 లక్షలు, కేపీహెచ్‌బీ సబ్ డివిజన్ పరిధిలో 80 లక్షల సర్వీస్‌లు (విద్యుత్ మీటర్లు) ఉన్నాయి. ఐటీ కారిడార్‌కు అనుసంధానంగా ఉన్న ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో నాణ్యత , నిరంతరం విద్యుత్ సరఫరా చేయడంపై అధికారులు దృష్టి సారించారు. డీఈ శ్యామ్ కుమార్ నేతృత్వంలో ఏడీఈలు కమలాకర్‌రెడ్డి,



ఏఈల పర్యవేక్షణలో పనుల్లో వేగం పెంచారు.

కొనసాగుతున్న పనులు

కొండాపూర్ డివిజన్‌లోని కొండాపూర్, వైట్‌ఫీల్డ్, కేపీహెచ్‌బీ, అల్లాపూర్, బాలాజీనగర్ తదితర ఐదు సెక్షన్లలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులు కొనసాగుతున్నాయి. 50 కిలోమీటర్ల 11 కేవీ వైర్ల మార్పిడి, 22 కిలోమీటర్లు ఎల్‌టీ లైన్ మార్పిడి చేపడుతున్నారు. అదనంగా 33 ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు, ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ పెంచడం, సబ్‌స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల కెపాసిటీ పెంచుతున్నారు. కనెక్షన్లు ఎక్కువగా ఉన్న లైన్లను బైఫరికేషన్ చేయడం, ఇంటర్ లింకింగ్ చేసి ఓల్టేజీ సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నారు.



కేవీ లైన్ మరమ్మతులు చేస్తున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

రూ.21.94 కోట్లతో జరుగుతున్న పనులు ఇవే

1. రూ.12.10 కోట్లతో 16 పనులు 11 కేవీ ఫీడర్ బైఫర్‌కేషన్
2. రూ.1.26 కోట్లతో 13 పనులు 11 కేవీ లైన్స్ ఇంటర్ లైన్స్ లింక్
3. రూ.2.34 కోట్లతో 33 అడిషనల్ డీటీఆర్‌లు
4. రూ.4.80 కోట్లతో 53 ఎలన్స్‌మెంట్ ఆఫ్ డీటీఆర్స్
5. రూ.1.12 కోట్లతో 32 ఎల్‌టీ లైన్స్ అడిషనల్ సర్క్యూట్స్
6. రూ.50 లక్షలతో 8 పనులు డ్యామేజ్ కేబుల్స్ మార్పిడి

నాణ్యమైన విద్యుత్ సరఫరా లక్ష్యం

మార్చి 15 నుంచి జూన్ 15 వరకు వేసవిలో అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడమే లక్ష్యంగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయి. గత వేసవిలో ఎదురైన సమస్యలు, ప్రతి సంవత్సరం 25 శాతం పెరిగే లోడ్‌ను పరిగణనలోకి తీసుకొని రూపొందించిన ప్రతిపాదనలకు అనుగుణంగా బడ్జెట్ కేటాయించారు. – కొండాపూర్ డీఈ శ్యామ్‌కుమార్

హెచ్‌సీయూ టు వీసీ

- యోగి వేమన వర్సిటీకి సీనియర్ ప్రొఫెసర్ పి.ప్రకాశ్‌బాబు
- ఆంధ్రా వర్సిటీకి హెచ్‌సీయూ పూర్వవిద్యార్థి జీపీ.రాజశేఖర్



ప్రొఫెసర్ పి.ప్రకాశ్‌బాబు



డాక్టర్ జీపీ.రాజశేఖర్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీతో అనుబంధమున్న ఇద్దరికి వైస్‌ఛాన్సలర్లుగా పనిచేసే అవకాశం లభించింది. హెచ్‌సీయూలో సీనియర్ ప్రొఫెసర్‌గా గుర్తింపు పొందిన ప్రొఫెసర్ పి.ప్రకాశ్‌బాబును యోగి వేమన విశ్వవిద్యాలయ వీసీగా నియామకమయ్యారు. ప్రస్తుతం ఈయన స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్‌లో సీనియర్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు. హెచ్‌సీయూ పూర్వ విద్యార్థి, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో గణిత శాస్త్ర ప్రొఫెసర్‌గా పనిచేసే జీపీ.రాజశేఖర్‌కు ఆంధ్రావర్సిటీ వీసీగా అవకాశం వచ్చింది. వీరిద్దరూ ఏపీకి చెందినవారే. డాక్టర్ జీపీ రాజశేఖర్‌ది విశాఖపట్నం కాగా, పి.ప్రకాశ్‌బాబుది ఎన్‌టీఆర్ జిల్లా జగ్గయ్యపేట. వీరి నియామకం పట్ల హెచ్‌సీయూ టీచింగ్, నాన్‌టీచింగ్ ఉద్యోగులు, అధికారులు సంతోషం వ్యక్తం చేశారు.

ఘనంగా బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

పటాన్‌చెరు: దేవాలయాలు ఆధ్యాత్మికతకు నెలవని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు.బుధవారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ముత్తంగి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ అక్క మహంకాళి సహిత కామారతి బీరప్ప విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని కోరారు. దేవాలయ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తానని తెలిపారు. మాజీ వైస్ ఎంపీపీ స్వప్న శ్రీనివాస్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయకుమార్, మాజీ సర్పంచ్ ఉపేందర్ పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

నిరంతరాయంగా వెలుగులు



భెల్ ఎంఐజీ కాలనీ రైల్వేలైన్ రోడ్డులో వెలుగుతున్న వీధి దీపాలు



క్వార్టర్ నంబర్ 1236 లైన్‌లో..

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి సర్కిల్‌లో వీధిదీపాలు నిరంతరాయంగా వెలుగుతున్నాయి. అయినా సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. సర్కిల్ పరిధిలోని భెల్ ఎంఐజీ కాలనీలో బుధవారం పలుచోట్ల లైట్లు నిరంతరాయంగా వెలుగుతుండటంతో విద్యుత్ దుబారా అవుతోంది. జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఈ సమస్య తరచూ పునరావృతం అవుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



క్వార్టర్ నంబర్ 1096 ఎదురుగా ..



క్వార్టర్ నంబర్ 1055 వద్ద..

స్పా ముసుగులో..

గచ్చిబౌలి: స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న నిర్వాహకుడు, ముగ్గురు విటులను అదుపులోకి తీసుకున్న సంఘటన గచ్చిబౌలి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. శ్రీరాంనగర్ కాలనీలో స్టైలిష్ బ్యూటీ స్పా పేరిట వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో యాంటి హ్యూమన్ ట్రాఫికింగ్, గచ్చిబౌలి పోలీసులు బుధవారం దాడులు చేశారు. నిర్వాహకుడు సత్యనారాయణ, విటులు శ్రీకాంత్, గోవిందరావు, అప్పారావులను అదుపులోకి తీసుకున్నారు. నలుగురు యువతులను రెస్క్యూ హోంకు తరలించారు. ఘటనా స్థలంలో కండోమ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరుచోట్ల ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు మృతి



మియాపూర్: వేర్వేరు చోట్ల ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. మియాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మియాపూర్ మెట్రో స్టేషన్ పార్క్‌లో ఓ వ్యక్తి అపస్మారకస్థితిలో పడి ఉన్నాడని మంగళవారం అర్ధరాత్రి ప్రజలు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా ఆ వ్యక్తి అప్పటికే మృతిచెంది ఉన్నాడు. అతని వద్ద ఎలాంటి సమాచారం లభించలేదు. దీంతో పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. వ్యక్తి వయస్సు సుమారు 40– 45 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మద్యం సేవించి ఉన్నాడని దీనివల్ల మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

మరో ఘటనలో..

మియాపూర్ పోలీస్‌స్టేషన్ సీఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని న్యూ హఫీజ్‌పేట్, ఆదిత్యనగర్ మెయిన్‌రోడ్డులో ఉన్న ఓ హోటల్ ముందు షటర్ల వద్ద ఓ వ్యక్తి పడి ఉన్నాడని బుధవారం ఉదయం మియాపూర్ పోలీసులకు స్థానికులు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా అప్పటికే ఆ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు.సుమారు రెండు రోజుల క్రితమే మృతి చెంది ఉంటాడని ముఖం గుర్తుపట్టలేని స్థితిలో ఉందని తెలిపారు. వ్యక్తి గురించి చుట్టుపక్కల ఆరా తీయగా సమాచారం లభించ లేదు. అతని వయస్సు సుమారు 30 నుండి 35 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గంగారం, పటేల్‌కుంటలను అభివృద్ధి చేస్తాం

జెడ్‌సీ ఉపేందర్‌రెడ్డి

గచ్చిబౌలి: మల్కంచెరువు తరహాలో చెరువులను అభివృద్ధి చేస్తామని జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి వెస్ట్‌జోన్ జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హెచ్‌ఎండీఏ, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి ఆయన పటేల్‌కుంట, గంగారం చెరువులను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ శేరిలింగంపల్లి జోన్ పరిధిలో గంగారం, పటేల్‌కుంట చెరువులను హెచ్‌ఎండీఏ నిధులతో తీర్చిదిద్దుతామని తెలిపారు. ఇందుకు సంబంధించి ప్రణాళికలను రూపొందించాలని అధికారులకు ఆయన సూచించారు. అధికారులు విలువైన స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా దృష్టి పెట్టాలని చెరువుల పరిసరాలలో నిర్మాణ, వ్యర్థాలు వేయకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో చందానగర్ సర్కిల్ ఉప కమిషనర్ మోహన్‌రెడ్డి, వైద్యాధికారి డాక్టర్ రవి, డీఈ దుర్గాప్రసాద్, ఇరిగేషన్ డీఈ నళిని, హెచ్‌ఎండీఏ అధికారులు పాల్గొన్నారు.

దుర్గం చెరువు పరిశీలన

శేరిలింగంపల్లిలోని దుర్గంచెరువును జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి తనిఖీ చేశారు. మురుగునీరు చెరువులో చేరకుండా చేపట్టాల్సిన ప్రత్యామ్నాయ చర్యలపై సమీక్షించారు. చెరువు పరిసరాలలోని ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు చెరువులోకి చేరకుండా పైప్‌లైన్ల ద్వారా డ్రైనేజీలకు అనుసంధానించుకునేలా అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. హెచ్‌ఎండీఏ సీఈ రవీందర్, డిప్యూటీ శివకుమార్‌రెడ్డి, ఇరిగేషన్ డిప్యూటీ ఈఈ నళిని, ఏఈ పావని, డీసీ ముకుందరెడ్డి, ఎలక్ట్రికల్ ఈఈ మల్లికార్జున్, వైద్యాధికారి చంద్రశేఖర్, ఎంటమాలజీ విభాగం అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో కలిసి చెరువును పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డి

హెచ్‌సీయూలో కళాబజార్

ఫైన్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహణ

రాయదుర్గం: విద్యార్థుల సృజనాత్మతక, నైపుణ్య, కళాత్మక ఆవిష్కరణల 'ఆర్ట్ సౌక్–2025'ను హెచ్‌సీయూలో సరోజినీనాయుడు స్కూల్ ఆఫ్ ఆర్ట్ అండ్ కమ్యూనికేషన్‌లోని ఫైన్ ఆర్ట్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 'ఆర్ట్' అంటే కళ అని, 'సౌక్' అంటే బజార్ అనే అరబిక్ పదం అని తెలిపారు. విద్యార్థులలో ఉన్న కళను ప్రోత్సహించడానికి వేదిక ఏర్పాటు చేశారు. ప్రతియేటా ఫైన్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శనను నిర్వహిస్తారు. విద్యార్థుల పెయింట్‌లను, టెర్రకోట, సిరామిక్స్ శిల్పాలు, పేపియర్ మాచే మాస్కులు, స్టోన్‌వేర్, ఆభరణాలు తదితరాలను ప్రదర్శనలో ఏర్పాటు చేసినట్లు వివరించారు.





సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే గాంధీ



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ, బాలానగర్ ఏసీపీ హన్మంతరావు తదితరులు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని పీఎస్‌ఆర్ ఎంపైర్ కాంప్లెక్స్‌లో హెల్ప్ ఫర్ సైబర్ విక్టిమ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, బాలానగర్ ఏసీపీ హన్మంతరావు, జగద్గిరిగుట్ట సీఐ నర్సింహ, జీడిమెట్ల సీఐ మల్లేశం , సంస్థ చైర్మన్ పులి అరవింద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ హెల్ప్ ఫర్ సైబర్ విక్టిమ్స్ ఫౌండేషన్ సేవలు అమోఘమని, సైబర్ బాధితులకు సహాయం చేయడానికి పోలీస్ డిపార్టుమెంట్‌కు సాంకేతిక సహాయ సహకారాలు అందించటం ముఖ్య ఉద్దేశమన్నారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్; తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలి


రాయదుర్గం: శివాజీ మహరాజ్ జయంతి వేడుకలను బాబూజగ్జీవన్‌రామ్ యువజన సంఘం ఆధ్వర్యంలో బీజేఆర్ నగర్‌లో బుధవారం నిర్వహించారు. శివాజీ చిత్రపటాన్ని ఏర్పాటు చేసి భారీ పూలమాల వేసి నివాళులు అర్పించారు. బస్తీవాసులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొని శివాజీ మహారాజ్ గొప్పతనాన్ని గుర్తు చేసుకున్నారు.

మియాపూర్‌లో..

మియాపూర్: యావత్ భారత జాతికి ఛత్రపతి శివాజీ మహారాజ్ స్ఫూర్తి దాయకమని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ వి. జగదీశ్వర్‌గౌడ్ అన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీ శివాలయం నుండి తుల్జాభవానీ ఆలయం వరకు బయల్దేరిన ఛత్రపతి శోభాయాత్రను భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ సభ్యులతో కలిసి ప్రారంభించారు. శివాలయం నుండి మియాపూర్, మదీనాగూడ, చందానగర్, జాతీయ రహదారి మీదుగా తారానగర్ తుల్జా భవానీ ఆలయం వరకు కొనసాగింది. శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఛత్రపతి శివాజీని యువత ఆదర్శంగా తీసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్, నాయకులు రాచమల్ల నాగేశ్వర్‌గౌడ్, మల్లేష్, సంజీవరెడ్డి, వీరేందర్‌గౌడ్, సాంబశివరావు, రవికుమార్, విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.



శోభాయాత్రను ప్రారంభిస్తున్న జగదీశ్వర్‌గౌడ్



వేడుకలో పాల్గొన్న స్థానికులు, నాయకులు, యువజన సంఘం ప్రతినిధులు

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.ట్రాఫిక్ సీఐ లాలూనాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం నిర్వహించిన డ్రైవ్‌లో 10 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను బుధవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 7గురికి రూ.1500 జరిమానా ,ఒకరికి రూ.2 వేలు, మరొకరికి రూ.వెయ్యి, మరొకరికి జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణాల తొలగింపు

మోతీనగర్: చెరువులు, కుంటలు, నాలాల సమీపంలో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేపట్టరాదని అధికారులు సూచించారు. కూకట్‌పల్లి నియోజకవర్గం, అల్లాపూర్ డివిజన్, సఫ్దార్‌నగర్ ప్రధాన రోడ్డులోని కాముని చెరువు సమీపంలో నిబంధనలకు వ్యతిరేకంగా చేపట్టిన నిర్మాణాన్ని బుధవారం జీహెచ్‌యంసీ మూసాపేట సర్కిల్ పట్టణ ప్రణాళిక సిబ్బంది, కూకట్‌పల్లి రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సంయుక్త ఆధ్వర్యంలో తొలగించారు.

బాలిక అదృశ్యం



జుగిని(ఫైల్)

మాదాపూర్: మతిస్థిమితం లేని బాలిక ఇంటి నుంచి వెళ్లిపోయింది. మాదాపూర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రావణి హాస్పిటల్ దగ్గరగల గుడిసెలలో నివసించే మంజుదేవి, అమిత్‌పర్వానిలకు ముగ్గురు కొడుకులు,కూతురు. కూతురు జుగిని (10)కి మతిస్థిమితం లేదు. కాగా ఈనెల 16వ తేదీ తల్లి ఇంట్లో లేని సమయంలో వెళ్ళిపోయింది.దీంతో చుట్టుపక్కల వారిని విచారించగా ఆచూకీ లభించలేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.